క్లుప్తంగా

రాజీమార్గానికి వేదిక 'లోక్ అదాలత్'



మాట్లాడుతున్న జడ్జి లావణ్య

రాయదుర్గంటౌన్: కక్షిదారులు రాజీ మార్గంతో కేసులను పరిష్కరించుకునేందుకు అత్యుత్తమ వేదిక 'జాతీయ లోక్ అదాలత్' అని మండల న్యాయసేవా అధికార సంస్థ చైర్‌పర్సన్, జడ్జి ఎన్.లావణ్య అన్నారు. శనివారం స్థానిక కోర్టులో జడ్జి ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. జడ్జి ఆధ్వర్యంలో రాజీ మార్గంతో 313 కేసులను పరిష్కరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లోనాంద, రూరల్ సీఐ యుగంధర్, ఎస్ఐ సుమన్, గుమ్మఘట్ట ఎస్ఐ సునీత, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే ట్రాక్ పరిశీలన



కదిరిదేవరపల్లి రైల్వే స్టేషన్‌ను పరిశీలిస్తున్న దక్షిణ మధ్య రైల్వే శాఖ అధికారులు

కంబదూరు: మండలంలోని కదిరిదేవరపల్లి నుంచి కంబదూరు మీదుగా కర్ణాటకలోని పెద్దపల్లి, కె.రాంపురం వరకూ నూతనంగా నిర్మించిన రైల్వే ట్రాక్‌ను శనివారం దక్షిణ మధ్య రైల్వే శాఖ అధికారులు అభియ్‌కుమార్ రాయ్, గుప్తా, రామన్, ప్రదీప్‌కుమార్ పరిశీలించారు. ట్రైన్ వెళ్లేందుకు ట్రాక్ అనుకూలంగా ఉందో లేదోనని ట్రయల్ రన్ ద్వారా గమనించారు. అలాగే కదిరిదేవరపల్లి, కంబదూరు రైల్వే స్టేషన్ లోని భవనాలు, ప్లాట్‌ఫాం, కల్వర్టు, తాగునీటి వసతిని పరిశీలించారు. ప్రస్తుతం తిరుపతి నుంచి కదిరిదేవరపల్లి నడుస్తున్న తిరుపతి ప్యాసింజర్ రైలు త్వరలో కంబదూరు, కె.రాంపురం వరకూ రాకపోకలు ప్రారంభమవుతాయని రైల్వే శాఖ అధికారులు తెలిపారు.

ప్రమాదంలో వృద్ధుడి మృతి

రాయదుర్గం రూరల్: పంట కోత యంత్రంలో చిక్కుకుని గాయపడిన ఓ వృద్ధుడిని ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. రాయదుర్గంలోని లక్ష్మీబజార్‌కు చెందిన వన్నప్పశెట్టి (70).. తన స్వగ్రామం రాతిబావి వంకలో కంది పంట సాగుచేశాడు. ఈ క్రమంలో శనివారం పంట కోత చేపట్టాడు. హార్వెస్టింగ్ మిషన్ ద్వారా చేపట్టిన పంట కోతలో కందులు వేరుపడుతున్న విషయాన్ని గమనిస్తుండగా ప్రమాదవశాత్తు ఎడమచెయ్యి మిషన్‌లో ఇరుక్కుపోయింది. గమనించిన డ్రైవర్ వెంటనే యంత్రాని ఆఫ్ చేసి, వన్నప్పశెట్టిని వెలికి తీశాడు. చేతితో పాటు తలకూ బలమైన గాయాలైన వన్నప్పశెట్టిని కుటుంబసభ్యులు అనంతపురంలోని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడి కుమారుడు శ్రీధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

డి హీరేహాళ్(రాయదుర్గం): మండలంలోని జాజరకల్లు చెక్‌పోస్టు వద్ద శనివారం విజిలెన్స్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా శనివారం చేపట్టిన తనిఖీల్లో 155 కింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడింది. ఈ మేరకు డిప్యూటీ తహసీల్దార్ బసవకుమార్ తెలిపారు. అశోకా లేలాండ్ వాహనాన్ని సీజ్ చేసి డి.హీరేహాల్ పోలీసులకు అప్పగించారు. స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యాన్ని రాయదుర్గం స్టాక్‌పాయింట్‌కు తరలించారు. బియ్యం తరలిస్తున్న కర్ణాటకలోని తుమకూరు నివాసి జావేద్, డ్రైవర్ హబీబ్‌పై కేసు నమోదు చేశారు.

గేదె మృతి

కంబదూరు: మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన సునందమ్మ అనే రైతుకు చెందిన గేదె శనివారం అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో రూ.50 వేల నష్టం వాటినట్లు బాధిత రైతు వాపోయింది. అధికారులు స్పందించి ఆదుకోవాలని ఆమె వేడుకుంది.

సపోట తోట దగ్ధం

వజ్రకరూరు: మండలంలోని కమలపాడులో శనివారం మధ్యాహ్నం మంటలు చెలరేగి రైతు రాజశేఖరరెడ్డికి చెందిన సపోట తోట దగ్ధమైంది. గుర్తు తెలియని వ్యక్తులు గుట్ట వద్ద ఎండు గడ్డికి నిప్పు పెట్టడంతో మంటలు వ్యాపించాయి. తోటను చుట్టుముట్టిన మంటలను ఆర్పేందుకు రైతు రాజశేఖరరెడ్డికి చుట్టు పక్కల రైతులు సహకరించారు. ఐదు ఎకరాల్లో 450 సపోటా చెట్లను సాగు చేస్తుండగా 350 చెట్లు, పంటతో సహా కాలి బూడిదయ్యాయి. దీంతో రైతుకు రూ. 3లక్షలకు పైగా నష్టం వాటిల్లింది. సమాచారం అందుకున్న రెవెన్యూ, ఉద్యాన అధికారులు అక్కడకు చేరుకుని పరిశీలించి, వివరాలు నమోదు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కూడేరు: 33 కేవీ విద్యుత్ లైన్, కూడేరులోని విద్యుత్ ఉపకేంద్రంలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ మరమ్మతులు చేపడుతున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ గౌస్ శనివారం తెలిపారు. ఆ సమయంలో మండలమంతా విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యం



'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న విశ్వ, పైలా, గిరిజమ్మ



హాజరైన గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు

- మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

కూడేరు: ప్రజల అండదండలే వైఎస్సార్‌సీపీ పునాదులు. అందరూ సమష్టిగా పనిచేసి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని, అభివృద్ధిని ప్రతి ఇంటికీ వివరించి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, పిలుపునిచ్చారు. శనివారం స్థానిక శివరావు ఫంక్షన్‌లో హాల్‌లో సచివాలయాల మండల కన్వీనర్ జల్లిపల్లి దేవేంద్ర అధ్యక్షతన గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేస్తున్న ప్రతిపక్ష పార్టీలు, ఎల్లో మీడియాతో మనం యుద్ధం చేయాల్సి ఉందన్నారు. కళ్లెదుటే అభివృద్ధి కనిపిస్తున్నా ప్రభుత్వంపై చేస్తున్న ఆరోపణలు, దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు అందరూ సైనికుల్లా పనిచేయాలని సూచించారు. జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ అధికారంలోకి వస్తే వలంటీర్, సచివాలయ వ్యవస్థను తొలగిస్తానని టీడీపీ అధినేత చంద్రబాబు పదే పదే చెబుతున్నాడని, మీరు ఈ వ్యవస్థలో కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడానికి కీలక పాత్ర పోషించాలని సూచించారు. టీడీపీ కార్యకర్తల ఇళ్లకు కూడా వెళ్లి ప్రభుత్వం చేసిన లబ్ధిని వివరించాలన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు ఒక శక్తిగా మారి పార్టీ బలోపేతానికి, విజయానికి సారథులుగా నిలవాలన్నారు. మీకు కేటాయించిన 25 ఇళ్ల పరిధిలోని కుటుంబాలు సీఎం జగన్‌కు మద్దతుగా నిలిచేలా చూడాలన్నారు. చంద్రబాబు వస్తే రాష్ట్రం కరువు కోరల్లో చిక్కుకుంటుందని, జగన్ అధికారంలోకి వస్తే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి పథంలో నడిపిస్తారన్న నమ్మకాన్ని ప్రజలకు కలుగజేయాలన్నారు. అనంతరం 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నారాయణ రెడ్డి, వైస్ ఎంపీపీలు దేవా, సుబ్బమ్మ, అగ్రి అడ్వైజరీ మండల చైర్‌పర్సన్ నిర్మలమ్మ, కోఆప్షన్ సభ్యుడు సర్దార్, వైఎస్సార్ సీపీ నేతలు సీపీ వీరన్న, తుప్పటి హరీష్ , బైరెడ్డి రామచంద్రారెడ్డి, రామ్మోహన్, విజయ భాస్కర్ రెడ్డి , హనుమంత రెడ్డి, మదన్ మోహన్ రెడ్డి, సత్యనారాయణ, భాస్కర్ రెడ్డి,తోపుదర్తి రామాంజనేయులు, ఎర్రిస్వామి, క్రిష్టప్ప, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పాల్గొన్నారు.

లోకేష్ యాత్ర అట్టర్ ఫ్లాప్



మాట్లాడుతున్న విప్ కాపు

రాయదుర్గం: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన పాదయాత్ర తెలుగుదేశం పార్టీకి పాడె యాత్ర కాబోతుందని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం విప్ కార్యాలయంలో ఆయన 'సాక్షి' తో మాట్లాడారు.. లోకేష్ పాదయాత్ర అట్టర్ ఫ్లాప్‌గా సాగుతోందన్నారు. జనం రాక వెల వెలబోతుండడంతో ఆ పార్టీని ప్రజలు ఎంత మాత్రం విశ్వసిస్తున్నారో అర్థం చేసుకోవాలన్నారు. ప్రజాస్వామ్య విలువలు తెలియని లోకేష్‌తో 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు పాదయాత్ర చేయించడం ఎవరిని ఉద్ధరించడానికో చెప్పాలని నిలదీశారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల వారు యాత్రలో ఎక్కువగా కనిపిస్తున్నట్టు సోషల్ మీడియా వైరల్ అవుతోందన్నారు. పాదయాత్ర అంటే ప్రజలకు వైఎస్సార్ ఫ్యామిలీ మాత్రమే గుర్తొస్తుందన్నారు. లోకేష్ యాత్ర కేవలం సీఎం జగన్‌ను విమర్శించేందుకే సరిపోతుందని ఎద్దేవా చేశారు. గడిచిన ఐదేళ్ల టీడీపీ పాలన, ఈ మూడున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రజలకు చేకూరిన మేలుపై చర్చకు రావాలని సవాల్ విసిరారు. పుత్రుడు, దత్తపుత్రుడు, దుష్ట చతుష్టయం కలసి ఎంత దుష్ప్రచారం చేసినా జనం నుంచి జగన్‌ను దూరం చేయడం సాధ్యం కాదన్నారు. టీడీపీ వెంటిలేటర్‌పై ఉందని ఇలాంటి యాత్రలు ఎన్ని చేసినా ప్రయోజనం ఉండబోదన్నారు.

వెన్నపూస రవీంద్రారెడ్డి విజయానికి కృషి చేద్దాం

రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీలో నిలిచిన వెన్నపూస రవీంద్రారెడ్డి విజయానికి పార్టీశ్రేణులంతా శక్తి వంచన లేకుండా కృషి చేయాలని విప్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రగతి, అభివృద్ధిపై వివరించి ఓటు అభ్యర్థించాలన్నారు. నిరుద్యోగులు, ఉపాధ్యాయులకు అన్ని విధాలా సీఎం జగన్‌తోనే మేలు చేకూరుతుందనే విషయం స్పష్టంగా తెలియజేయాలన్నారు. జిల్లాలోనే రాయదుర్గంలో అత్యధిక మెజార్టీ కట్టబెట్టి మద్దతుగా నిలుద్దామని వివరించారు. పార్టీలోని ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘం నాయకులు, మండల కన్వీనర్లు, ముఖ్య నాయకులంతా ఈ ఎన్నికల పైనే దృష్టి సారించాలన్నారు. రవీంద్రారెడ్డి పట్టభద్రుల స్థానానికి ఎంపికైతేనే నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యలకు అండగా నిలుస్తారని, ప్రతి ఓటరూ ఆశీర్వదించాలని విప్ విజ్ఞప్తి చేశారు.

మహిళా సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఆర్డీటీ డైరెక్టర్ దశరథ

కణేకల్లు: మహిళల సమస్యల పరిష్కారానికి సోషల్ యాక్షన్ టీం సమష్టిగా కృషి చేయాలని ఆర్డీటీ వికలాంగుల విభాగం డైరెక్టర్ దశరథ అభిప్రాయం వ్యక్తం చేశారు. స్థానిక బిస్మిల్లా ఫంక్షన్ హాలులో సాట్ (సోషియల్ యాక్షన్ టీం) సభ్యులకు ఆర్డీటీ మూడురోజుల పాటు 'గ్రామస్థాయి సాట్ నాయకుల స్వశక్తీకరణ శిక్షణ' కార్యక్రమం నిర్వహించింది. శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. ఆయన మాట్లాడుతూ మహిళలు, బాలికలపై జరుగుతున్న దురాచారాలు, అసాంఘిక కార్యకలపాలను కట్టడి చేయడానికి ఆర్డీటీ ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. ఒక్కో గ్రామంలో ఎంపికైన నలుగురు సాట్ సభ్యులు మహిళా సమస్యల పరిష్కారంతో పాటు వారికి ఉజ్వలమైన భవిష్యత్ అందించేందుకు సమష్టిగా పోరాటం చేయాలన్నారు. కణేకల్లు, బొమ్మనహాళ్, రాయదుర్గం, గుమ్మగట్ట, డి.హిరేహాళ్, ఉరవకొండ, విడపనకల్లు, కూడేరు, వజ్రకరూరు, గుంతకల్లు మండలాల నుంచి సాట్ సభ్యులు 250 మంది శిక్షణకు హాజరయ్యారు. ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ క్రిష్టారెడ్డి, హెఆర్‌బీ విభాగం డైరెక్టర్ నిరంజన్, సీబీఆర్ విభాగం చైర్మన్ తిప్పేస్వామి, ఏటీఎల్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

వాల్మీకి సంఘం అధ్యక్షుడికి సన్మానం



అధ్యక్షుడు గోవింద్‌ను సన్మానిస్తున్న దృశ్యం

కంబదూరు: వాల్మీకి సేవా సమితి తాలూకా అధ్యక్షుడిగా నియమితులైన ములకనూరు గోవింద్‌ను శనివారం కంబదూరు సర్పంచ్ సాకే గంగాధర్, ఎంపీటీసీ మల్లేష్, అతని స్నేహితులు శివన్న, శ్రీనివాసులు, రాజు, వన్నూర్‌సాబ్, దాబా నరసింహులు తదితరులు సత్కరించారు. భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని వారు ఆకాంక్షించారు.

రామసాగరంలో స్కౌట్స్ శిక్షణ శిబిరం



స్కౌట్స్ క్యాంపు నిర్వహిస్తున్న మాస్టర్లు

బొమ్మనహాళ్ (బొకుగుప్ప): మండలంలోని రామసాగరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ అనంతపురం జిల్లా అసోషియేషన్ ఆధ్వర్యంలో స్కౌట్స్ సోపాన టెస్టింగ్ క్యాంపు నిర్వహించారు. హెచ్ఎం బాలాజీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అనంతపురం, సత్యసాయి జిల్లాల్లోని 15 ప్రభుత్వ పాఠశాలల నుంచి 120 మంది విద్యార్థులు, స్కౌట్స్ మాస్టర్లు క్యాంప్‌లో పాల్గొన్నారు. ఐదు రోజుల పాటు జరిగే క్యాంప్‌లో తొలిరోజు స్కౌట్స్ జెండాను మాస్టర్లతో కలసి హెచ్ఎం ఎగురవేసి స్కౌట్స్ కోర్సు ఉద్దేశాలు, ఉపయోగాలను వివరించారు. శిక్షణ శిబిరానికి జెడ్పీటీసీ సభ్యురాలు మమత, త్రిలోక్‌రెడ్డి దంపతులు ఆర్థిక సాయం చేసారని స్కౌట్స్‌లు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కోర్సు లీడర్ విజయ్‌కుమార్, సభ్యులు వెంకటరామప్ప, భాస్కర్, నాగరాజు, రామాంజనేయులు, మల్లినాథ్ పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహమూర్తుల ప్రతిష్ట

బొమ్మనహాళ్ (బొకుగుప్ప): మండలంలోని తగ్గుపర్తి శివాలయంలో శనివారం శివపార్వతులు, తగ్గుపర్తమ్మదేవి ఉత్సవ విగ్రహ మూర్తుల చర ప్రతిష్ఠ పూజలు, హోమాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, నవగ్రహ షోడశ ఉపచార పూజ, భక్తుల స్వహస్తాలతో పంచామృతాభిషేకాలు, మహాస్నపన, మృత్యుంజయ దీక్షా హోమం, చండీ పారాయణ పూజలు చేపట్టారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామునే విగ్రహచర ప్రతిష్ఠ అనంతరం చండీ హోమాలు, పూర్ణాహుతి హోమాలు, అన్నదాన నారాయణ సేవలను నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నాగేపల్లి రహదారికి మోక్షం



గతంలో అధ్వానంగా ఉన్న రోడ్డు



సిమెంటు రోడ్డు వేసిన దృశ్యం

కణేకల్లు: నాగేపల్లి నరక ప్రయాణానికి మోక్షం లభించింది. కణేకల్లు మండలంలోని నాగేపల్లి ఓ మారుమూల గ్రామం. కణేకల్లు–దర్గాహోన్నూరు మెయిన్ రోడ్డు నుంచి అర కిలోమీటర్ దూరం వెళ్లాల్సి ఉంటుంది. అధ్వాన్నంగా ఉన్న ఈ రోడ్డును గతంలో పాలకులెవరూ పట్టించుకోలేదు. గత టీడీపీ హయాంలో గ్రామస్తులు తమ గ్రామానికి రోడ్డు వేయమని అప్పటి మంత్రి కాలువ శ్రీనివాసులకు అనేక మార్లు విన్నవించారు. ఈ గ్రామంలో కాలువ సామాజిక వర్గానికి చెందిన వారు సుమారు 90 శాతం వరకూ ఉన్నారు. అయినా ఆయన పట్టించుకోలేదు. ఇటీవల గ్రామస్తులు సిమెంటు రోడ్డు వేయించమని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డికి విన్నవించారు. వెంటనే ఆయన స్పందించి ఏపీఆర్ఆర్‌పీ కింద రూ.43 లక్షలు మంజూరు చేయించారు. ఈ నిధులతో సిమెంటు రోడ్డు నిర్మించారు. రహదారి నిర్మాణం పూర్తవడంతో విప్‌తోపాటు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

యల్లారెడ్డి గారి తిమ్మారెడ్డికి నివాళి



తిమ్మారెడ్డి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, జర్నలిస్టులు

ఉరవకొండ: అనంతపురంలోని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి స్వగృహంలో శనివారం రాకెట్ల నారాయణరెడ్డి పెద్ద కుమారుడు జర్నలిస్ట్ యల్లారెడ్డి గారి తిమ్మారెడ్డి 23 వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. విశ్వేశ్వరరెడ్డి, ఆయన కుమారుడు ప్రణయ్‌కుమార్‌రెడ్డి, పలువురు జర్నలిస్టులు తిమ్మారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి సీపీ వీరన్న, బెస్త కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రమణ, మునిరత్నం శ్రీనివాసులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రాయదుర్గంటౌన్: ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి సహకారంతో బ్రాహ్మణి సోషల్ వెల్ఫేర్, రూరల్ డెవలప్‌మెంట్, ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో పట్టణంలోని రిక్రియేషన్ క్లబ్‌లో శనివారం బెంగళూరులోని శంకర్ కంటి ఆస్పత్రి వైద్యులు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 70 మందికి వైద్యుడు సోమన్న పరీక్షలు నిర్వహించి, 30 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు వైఎస్సార్‌సీపీ నాయకుడు నేత్రపల్లి కాంతారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాసయాదవ్ తెలిపారు. నియోజకవర్గంలోని పేదలెవరూ కంటి చూపుతో బాధపడకూడదనే లక్ష్యంతో ప్రతి నెలా ఉచిత కంటి వైద్య శిబిరాలను ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, సతీమణి కాపు భారతి దంపతులు నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మంజునాథ, వైఎస్సార్ సీపీ నాయకులు రామకృష్ణారెడ్డి, ధనుంజయరెడ్డి, మధుసూధనరెడ్డి, వార్డు ఇన్‌చార్జ్ గంగాధర్, రిక్రియేషన్ క్లబ్ అధ్యక్షుడు గురుమాల రాజు, ఉపాధ్యక్షుడు మోపూరి వెంకటేశులు పాల్గొన్నారు.

నేటి నుంచి శివరాత్రి బ్రహ్మోత్సవాలు



బ్రహోత్సవాల పోస్టర్లను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు

కంబదూరు: మండల కేంద్రంలోని మల్లేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం నుంచి ఈ నెల 19 వరకూ శివరాత్రి బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త మల్లారి వెంకటేశులు తెలిపారు. శనివారం 58వ శివ పంచాక్షరి మహామంత్రాహ్వాన వాల్ పోస్టర్లను వైఎస్సార్‌సీపీ బీసీ, రైతు విభాగాల జిల్లా ప్రధాన కార్యదర్శులు గోవింద్, నీలి శంకరప్ప, సర్పంచ్ సాకే గంగాధర్, వసంతరాయుడు, వెంకటప్ప, గంగాధర్, పవన్, మల్లేష్, రామస్వామి, చంద్ర, నీళ్ల బాబు, బేల్దారి హనుమంతరాయుడు, రాజు, రాళ్లపల్లి గంగాధర్, బందర్ కొత్తపల్లి మల్లికార్జున విడుదల చేశారు.

సంక్షిప్త సమాచారం

16న ప్రత్యేక సమావేశం

వజ్రకరూరు: మండల కేంద్రంలోని రాజశేఖర్‌రెడ్డి జిన్నాలో ఈ నెల 16న గ్రామ సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి పి. రాచన్నగౌడ్ శనివారం తెలిపారు. సమావేశానికి ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.ప్రణయ్‌కుమార్‌రెడ్డి హాజరవుతారన్నారు. గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు హాజరు కావాలన్నారు.

ఆర్థిక సాయం అందజేత

బొమ్మనహాళ్: మండలంలోని ఉప్పరహాళ్ ఎస్సీ కాలనీకి చెందిన ఈరన్న కుమార్తె హంపమ్మ (30) అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు ముల్లంగి నారాయణస్వామి తదితరులు మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అలాగే దహన సంస్కారాలకు రూ.5 వేలు అందజేశారు.

ఆధార్ స్పెషల్ డ్రైవ్

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని బోరంపల్లి పంచాయతీ సచివాలయంలో రెండు రోజుల పాటు ఆధార్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ బాలాజీ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. సోమ, మంగళవారం సచివాలయంలో ఆధార్ సేవలు ఏర్పాటు చేశామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రేపు సర్వసభ్య సమావేశం

కళ్యాణదుర్గం రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బాలాజీ తెలిపారు. ఈమేరకు ఆయన శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎంపీపీ మారుతమ్మ అధ్యక్షతన జరిగే కార్యక్రమానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

పత్తి పంట ధ్వంసం

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్ గ్రామ శివారులో పత్తి పంట ధ్వంసం చేసినట్లు బాధితురాలు కమ్మరి నాగమ్మ తెలిపారు. గ్రామంలోని 240–1ఏబీ సర్వేనెంబర్‌లో 1.50 ఎకరాల్లో పత్తి పంటను సాగుచేశానని, పక్క పొలం రైతు పృథ్వీకుమా శుక్రవారం అర్ధరాత్రి ట్రాక్టర్‌తో ధ్వంసం చేశాడని బాధితురాలు వాపోయింది. సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఆమె తెలిపింది.

ఇసుక ట్రాక్టర్ సీజ్

బొమ్మనహాళ్: అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తున్న ఓ ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ శివ తెలిపారు. శనివార రాత్రి మండలంలోని దర్గాహొన్నూరు గ్రామానికి చెందిన సంతోష్ అనే వ్యక్తి ట్రాక్టర్‌తో వేదావతి హగరి నది నుంచి ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తుండగా.. కల్లుదేవనహళ్లి వద్ద ట్రాక్టర్‌ను సీజ్ చేశామన్నారు.

నో.. పార్కింగ్..!

- పార్కింగ్ స్థలాలూ వదలని భవనాల యజమానులు
- రోడ్డుపైనే నిలబడుతున్న వాహనాలు
- వేధిస్తున్న ట్రాఫిక్ సమస్య

- పట్టణంలోని టీ సర్కిల్ ప్రాంతంలో ఓ ప్రముఖ వస్త్ర దుకాణం యజమానులు పార్కింగ్ కోసం సెల్లార్‌ను ఏర్పాటు చేశారు. అయితే అక్కడ పార్కింగ్ కోసం స్థలం వదలకుండా సెల్లార్‌లో సైతం దుకాణాలను ఏర్పాటు చేసుకున్నారు. దీంతో వస్త్ర దుకాణాలకు వచ్చిన వినియోగదారులు షాపు ముందే వాహనాలను నిలిపివేస్తున్నారు. అటుగా వచ్చే ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలకు ఇబ్బందిగా మారుతోంది. అలాగే టీ సర్కిల్‌లో ఓ మందుల దుకాణం వద్ద సైతం ఇదే పరిస్థితి. మందుల కోసం వచ్చే వినియోగదారులు రోడ్డుకు అడ్డంగా బైకులు ఆపేసి దుకాణాల వద్దకు వెళ్తున్నారు. అసలే మలుపు కావడంతో ఇతర వాహనాలకు చాలా ఇబ్బందిగా మారింది.
- అనంతపురం ప్రధాన రహదారిలో ఓ హోటల్ కమ్ లాడ్జి నిర్వాహకుడు పార్కింగ్ కోసం సెల్లార్‌ను ఏర్పాటు చేశాడు. అయితే సెల్లార్‌ను సైతం వాణిజ్య పరమైన అవసరాలకు వినియోగించుకుంటున్నాడు. దీంతో హోటల్‌కు వచ్చే వాహనాలు రోడ్డుపైనే వదిలేయాల్సిన దుస్థితి ఏర్పడింది.



టీ సర్కిల్ సమీపంలో ఓ వస్త్ర దుకాణం ఎదుట వాహనాల పార్కింగ్



అనంతపురం రోడ్డులో ఓ హోటల్ ఎదుట కారు, బైకును నిలిపిన దృశ్యం

కళ్యాణదుర్గం: పట్టణంలో పార్కింగ్ స్థలాలను వదలకుండా యజమానులు భవంతులు నిర్మించి ట్రాఫిక్‌కు ఇబ్బందులు కల్పిస్తున్నారు. భవంతులు నిర్మించుకునే సమయంలో పార్కింగ్ స్థలం వదిలేలా మున్సిపల్ అధికారుల నుంచి అనుమతులు తీసుకుంటారు. కానీ భవంతిని నిర్మించిన అనంతరం అక్కడ పార్కింగ్ స్థలం ఉండదు. పార్కింగ్ కోసం వదిలిన స్థలాన్ని సైతం దుకాణాలుగా మార్చుకుని యథేచ్ఛగా వ్యాపారాలు కొనసాగిస్తున్నారు.

పెరుగుతున్న ట్రాఫిక్ సమస్య

ప్రధాన రహదారుల్లో రోడ్డుపైనే ఎక్కడికక్కడ వాహనాలను నిలిపివేయడంతో ట్రాఫిక్ సమస్య అధికమవుతోంది. ప్రధానంగా టీ సర్కిల్ నుంచి గాంధీ చౌక్ వరకూ నిత్యం వాహనాల రద్దీ కనిపిస్తుంటుంది. వాహనాలు ప్రధాన దారుల్లో ఆపకుండా ఉండేందుకు పోలీసులు జరిమానా విధిస్తున్నా ఏ మాత్రం ట్రాఫిక్ సమస్య తీరడం లేదు. భవంతులు నిర్మించే సమయంలో పార్కింగ్ స్థలం వదిలేలా చర్యలు తీసుకోవాల్సిన మున్సిపల్ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పార్కింగ్ స్థలాల్లో దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రధాన రహదారికి ఆనుకుని పెద్ద పెద్ద భవంతులు నిర్మించినా పార్కింగ్ స్థలాలు కనిపించకపోడం కొసమెరుపు. ఇప్పటికైనా భవంతులలో పార్కింగ్ స్థలాలను వదిలేలా అధికారులు చొరవ చూపాలని పలువురు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

భవంతులు నిర్మించి పార్కింగ్ స్థలాలను వదలని భవనాల యజమానులపై చర్యలు తీసుకుంటాం. పట్టణంలో ప్రత్యేక డ్రైవ్ చేపడుతాం. ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటాం. ఇందుకు భవన యజమానులు సహకరించాలి. – వెంకటేశులు, మున్సిపల్ కమిషనర్

రాష్ట్రస్థాయి సైన్స్ ఫేర్‌కు ఎంపిక



విద్యార్థినిని అభినందిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్ (బొకుగుప్ప): మండల కేంద్రంలోని కేజీబీవీలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని వేద చందన జిల్లా స్థాయి సైన్స్‌ఫేర్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికైందని ఎస్ఓ మంజుల తెలిపారు. విద్యార్థినిని ఎస్ఓతోపాటు ఎంఈఓ మల్లారెడ్డి, బోధన సిబ్బంది అభినందించారు.